శ్రీజ నం.1

న్యూఢిల్లీ: తెలంగాణ యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ సత్తాచాటింది. ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న శ్రీజ..తాజా ఐటీటీఎఫ్ ర్యాంకింగ్స్‌లో శ్రీజ భారత నంబర్‌వన్ ప్యాడ్లర్‌గా నిలిచింది. మంగళవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో శ్రీజ ఒక ర్యాంక్ మెరుగుపర్చుకుని 38వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో శ్రీజ తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌ను అందుకుంది. ఈ ఏడాది జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ కార్పస్ క్రిస్టి, బీరూట్ టైటిల్స్‌తో పాటు డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీలో మెరుగ్గా రాణించడం ద్వారా శ్రీజ తన ర్యాంకింగ్స్‌ను మరింత మెరుగుపర్చుకుంది. మరోవైపు స్టార్ ప్యాడ్లర్ మనికా బాత్రా 39వ ర్యాంక్‌లో నిలువగా, యశస్విని గొర్పాడే, అర్చనా కామత్ వరుసగా 99,100 ర్యాంక్‌లు దక్కించుకున్నారు. పురుషుల ర్యాంకింగ్స్‌లో శరత్‌కమల్ 37వ ర్యాంక్‌లో ఉండగా, సాతియాన్(60), మానవ్ ఠక్కర్(61) ఆకట్టుకున్నారు.

మళ్లీ ఆ ఆలోచనే లేదు

- రీఎంట్రీపై తేల్చేసిన సునీల్ నరైన్

కోల్‌కతా: ఐపీఎల్-17 సీజన్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనలతో అదరగొడుతున్న విండీస్ వీరుడు సునీల్ నరైన్ అంతర్జాతీయ క్రికెట్‌లో రీఎంట్రీపై స్పష్టతనిచ్చాడు. మళ్లీ తనకు అటువైపుగా వచ్చే ఆలోచనే లేదని, ఆ తలుపులు ఎప్పుడో మూసుకుపోయాయని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. నరైన్ స్పందిస్తూ... 'ఇటీవల కాలంలో నా ప్రదర్శనల పట్ల సంతృప్తిగా ఉన్నా. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడాలన్న అభిమానుల నిర్ణయాన్ని నేను గౌరవిస్తా. కానీ రిటైర్మెంట్ నిర్ణయంతో నేను ప్రశాంతంగా ఉన్నా. ఆ తలుపులు (రీఎంట్రీ) ఎప్పుడో మూసుకుపోయాయి. జూన్‌లో వెస్టిండీస్ తరపున టీ20 వరల్డ్ కప్ ఆడబోయే జట్టుకు నా శుభాకాంక్షలు' అని రాసుకొచ్చాడు.

లంక క్రికెట్‌లో 'ఫిక్సింగ్' కలకలం

కొలంబో: శ్రీలంక వేదికగా కొద్దిరోజుల క్రితమే నిర్వహించిన లెజెండ్స్ క్రికెట్ లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ లీగ్‌లో క్యాండీ స్వాంప్ ఆర్మీ యజమానిగా ఉన్న యోణి పటేల్.. పంజాబ్ రాయల్స్ మేనేజర్ ఆకాశ్‌తో కలిసి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డట్టు లంక మాజీ క్రికెటర్లు ఉపుల్ తరంగ, కివీస్ మాజీ క్రికెటర్ నీల్ బ్రూమ్ శ్రీలంక క్రీడాశాఖకు ఫిర్యాదు చేశారు. వీళ్ల ఫిర్యాదుతో కొలంబోని స్థానిక కోర్టు నిందితుల పాస్‌పోర్టులపై నిషేధం విధించి దేశం విడిచివెళ్లొద్దంటూ ఆదేశాలు జారీచేసింది.

భారత్‌లో ప్రపంచ చెస్ టోర్నీ పోరు?

ఏఐసీఎఫ్ యోచన

చెన్నై : ఈ ఏడాది జరగాల్సి ఉన్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను భారత్‌లో నిర్వహించాలని ఆలిండియా చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) భావిస్తోంది. రెండ్రోజుల క్రితం టొరంటో వేదికగా ముగిసిన క్యాండిడేట్స్ చెస్ టోర్నీని గెలుచుకున్న భారత యువగ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్.. వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ పోరులో చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో ఆడేందుకు అర్హత సాధించిన నేపథ్యంలో ఈ టోర్నీని ఇక్కడే నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్టు ఏఐసీఎఫ్ నితిన్ తెలిపారు. 'మేం పరిస్థితిని అంచనా వేస్తున్నాం. రాబోయే కొద్దిరోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వస్తుంది' అని చెప్పారు.

లక్నో ధమాకా

సీఎస్‌కేపై వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం

స్టోయినిస్ అజేయ శతకం

రుతురాజ్, దూబే మెరుపులు వృథా

ఇటీవలే సొంతగడ్డపై చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఓటమి రుచి చూపించిన లక్నో సూపర్ జెయింట్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆ జట్టుకు షాకిచ్చింది. వేదిక మారినా చెన్నైకి ఓటమి తప్పలేదు. పెట్టని కోట లాంటి చెపాక్ స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. రుతురాజ్ గైక్వాడ్ అజేయ శతకానికి తోడు దూబే సిక్సర్లతో చెన్నై బ్యాటింగ్‌లో 210 పరుగులు చేసినా వాటిని కాపాడుకోలేకపోయింది. లక్నో డేంజరస్ బ్యాటర్ మార్కస్ స్టోయినిస్ దంచికొట్టడంతో సొంత ఇలాఖాలో చెన్నై చిత్తైంది. ఈ విజయంతో లక్నో నాలుగో స్థానానికి చేరుకోగా, చెన్నై ఐదులో ఉంది.

రుతురాజ్ (108*)

స్టోయినిస్ (124*)

చెన్నై : డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌లో డబుల్ స్ట్రోక్ ఇచ్చింది. ఈనెల 19న లక్నోలో చెన్నైని ఓడించిన కెఎల్ రాహుల్ సేన.. మంగళవారం సీఎస్‌కే సొంతగడ్డపైనా అదే ఫలితాన్ని రిపీట్ చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నైకి కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (60 బంతుల్లో 108 నాటౌట్, 12 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీకి తోడు శివమ్ దూబే (27 బంతుల్లో 66, 3 ఫోర్లు, 7 సిక్సర్లు) మెరుపులు మెరిపించడంతో 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. భారీ ఛేదనలో 'లక్నో హల్క్' మార్కస్ స్టోయినిస్ (63 బంతుల్లో 124 నాటౌట్, 13 ఫోర్లు, 6 సిక్సర్లు) వీరవిహారంతో ఆ జట్టుకు 19.3 ఓవర్లలోనే విజయాన్ని కట్టబెట్టాడు. స్టోయినిస్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

గైక్వాడ్ శతకం.. దూబే దుమారం

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన చెన్నై ఆదిలోనే రహానే (1) వికెట్, డారిల్ మిచెల్ (11) వికెట్లను కోల్పోయినా రుతురాజ్ మాత్రం బౌండరీలతో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. జడేజా (16) నిష్క్రమణ తర్వాత వచ్చిన దూబే బాదుడుతో సీఎస్‌కే ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. స్టోయినిస్ వేసిన 13వ ఓవర్లోనే తొలి సిక్సర్ బాదిన అతడు.. యశ్ ఠాకూర్ 16వ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. తర్వాత బాధితుడు మోహ్సిన్ ఖాన్. 19వ ఓవర్లో 6,4,6తో 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తిచేశాడు. అంతకంటే ముందే ఠాకూర్ వేసిన 18వ ఓవర్లో గైక్వాడ్ 6, 4 తో 56 బంతుల్లోనే శతకం పూర్తిచేశాడు.

స్టోయినిస్ షో..

భారీ ఛేదనలో లక్నో ఇన్నింగ్స్ మూడో బంతికే ప్రమాదకర ఓపెనర్ క్వింటన్ డికాక్ వికెట్ కోల్పోయింది. కెప్టెన్ కెఎల్ రాహుల్ (16) కూడా విఫలమయ్యాడు. ఏడు ఓవర్లు ముగిసే పటప్పటికీ ఆ జట్టు చేసింది 51 పరుగులే. కానీ వన్‌డౌన్‌లో వచ్చిన స్టోయినిస్ చాలాకాలం తర్వాత బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. 26 బంతుల్లోనే 50 పరుగులు పూర్తిచేసిన అతడు.. నికోలస్ పూరన్ (15 బంతుల్లో 34, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) అండతో రెచ్చిపోయాడు. 34 బంతుల్లోనే 70 పరుగుల ఈ భాగస్వామ్యానికి పతిరాన తెరదించినా స్టోయినిస్ మాత్రం దంచికొట్టాడు. 56 బంతుల్లోనే సెంచరీ పూర్తిచేసిన అతడు.. ఆఖరి ఓవర్లో 15 రన్స్ రాబట్టి లక్నోకు విజయాన్ని అందించాడు.

1 పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యధికసార్లు 200 ప్లస్ స్కోరు చేసిన జట్లలో చెన్నై.. సోమర్‌సెట్ రికార్డును సమం చేసింది. ఈ రెండు జట్లూ ఏకంగా 34 సార్లు రెండు వందలకు పైగా స్కోరు చేశాయి. భారత్(32), ఆర్సీబీ, యార్క్‌షైర్(29) ఆ తర్వాత ఉన్నాయి.

2 లక్నో తరుపున ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్‌గా స్టోయినిస్ (124) నిలిచాడు. క్వింటన్ డికాక్ (140★) టాప్‌లో ఉన్నాడు.

124 ఐపీఎల్ లక్ష్యఛేదనలో లక్నో బ్యాటర్ స్టోయినిస్‌దే అత్యుత్తమ స్కోరు. ఇంతకుముందు పాల్ వాల్తటీ(120★), సెహ్వాగ్(119), శాంసన్(119) జాబితాలో ఉన్నారు.

3 ఈ ఐపీఎల్‌లో ఒక మ్యాచ్‌లో రెండు సెంచరీలు నమోదు కావడం ఇది మూడోసారి. ఆర్‌ఆర్ X ఆర్సీబీ, కేకేఆర్ X ఆర్‌ఆర్ మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు నమోదయ్యాయి.

సంక్షిప్త స్కోర్లు

చెన్నై : 20 ఓవర్లలో 210/4 (రుతురాజ్ 108 నాటౌట్, దూబే 66, హెన్రీ 1/28, ఠాకూర్ 1/47). లక్నో : 19.3 ఓవర్లలో 213/4 (స్టోయినిస్ 124 నాటౌట్, పూరన్ 34, పతిరాన 2/35, చాహర్ 1/11)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	8	7	1	0.69	14
కోల్‌కతా	7	5	2	1.20	10
హైదరాబాద్	7	5	2	0.91	10
లక్నో	8	5	3	0.14	10
చెన్నై	8	4	4	0.41	8
గుజరాత్	8	4	4	-1.05	8
ముంబై	8	3	5	-0.22	6
ఢిల్లీ	8	3	5	-0.47	6
పంజాబ్	8	2	6	-0.29	4
బెంగళూరు	8	1	7	-1.04	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

ఐపీఎల్ ముచ్చట్లు

ఇంటర్వెల్ ముగిసింది.. అసలు కథ ముందుంది!

నెల రోజుల క్రితం చెన్నైలో మొదలైన ఐపీఎల్ క్రికెట్ సినిమాలో ఒక అంకం ముగిసింది. మొత్తం 74 మ్యాచ్‌లు (70 లీగ్, 4 నాకౌట్) ఉన్న ఈ లీగ్‌లో ఆదివారం పంజాబ్-గుజరాత్ మధ్య ముగిసిన మ్యాచ్‌తో సగం సీజన్ పూర్తయింది. ముసుపెన్నడూ చూడని విధంగా రికార్డుల హోరుతో పొట్టి క్రికెట్‌లో 200 అంటేనే అబ్బో! అనుకునే దశ నుంచి.. వన్డేలలో మాదిరిగా 270, 280 స్కోర్లు చేస్తూ 'మిషన్ 300'ను పూర్తిచేసే దిశగా ఐపీఎల్ సాగుతోంది. 35 మ్యాచ్‌లు ముగిసేటప్పటికీ ఈ సీజన్‌లో ఇప్పటికే 8.99 రన్‌రేట్‌తో 'ఐపీఎల్‌లో మోస్ట్ హైస్కోరింగ్ సీజన్'గా 2024 రికార్డు లకెక్కింది. 17వ సీజన్‌లో పరాగ్, అభిషేక్, శశాంక్ సింగ్, అశుతోష్ వంటి పలువురు కుర్రాళ్లు అందివచ్చిన అవకాశాలను రెండు చేతులా అందుకుంటుంటే.. వేలంలో కోటానుకోట్లు దక్కించుకున్న స్టార్క్, కమిన్స్, కరన్, గ్రీన్ లాంటి ఆటగాళ్లు అట్టర్‌ప్లాఫ్ అవుతున్నారు. ఈ సీజన్ ఆరంభంలో కొన్ని మ్యాన్‌ల పాటు సొంత మైదానంలో మ్యాచ్‌లు ఆడిన జట్లు గెలవగా తర్వాత ఈ సంప్రదాయం మారింది. అసలు అంచనాలే లేకుండా బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఏడు విజయాలు, 14 పాయింట్లతో సగం సీజన్ లోపే ప్లేఆఫ్స్ బెర్తును దాదాపు ఖాయం చేసుకోగా కెప్టెన్‌ను మార్చిన ముంబై ఇండియన్స్ అంతర్గత విభేదాలతో సతమతమవుతోంది. కొత్త కెప్టెన్ కమిన్స్ నాయకత్వంలో హైదరాబాద్ రికార్డుల మీద రికార్డులతో ప్లేఆఫ్స్‌కు దగ్గరవుతోంది. ఐపీఎల్‌లో అత్యం త జనాకర్షక జట్టు అయిన బెంగళూరు పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచి అభిమానులను తీవ్ర నిరాశపరుస్తోంది. గత రెండు సీజన్లలో ప్లేఆఫ్స్ చేరిన గుజరాత్.. సగం సీజన్ ముగిసేసరికి నిరాశజనక ప్రదర్శనలతో విఫలమవుతోంది. సగం సీజన్ ముగిసిన నేపథ్యంలో ఇక నుంచి జట్లకు ప్రతి మ్యాచ్ కీలకం కానుంది.

37 మ్యాచ్‌లు ముగిసేటప్పటికీ ఈ సీజన్‌లో ఏడు సెంచరీలు

668 సిక్సర్లు నమోదయ్యాయి

బ్యాటర్లు బరిలోకి దిగితే బౌలర్లపై బాదుడు మంత్రాన్ని ప్రయోగించడంతో ఈ సీజన్‌లో 13 ఏండ్లుగా పదిలంగా ఉన్న ఆర్సీబీ అత్యధిక పరుగుల రికార్డు (263) నాలుగుసార్లు బ్రేక్ కాగా అందులో హైదరాబాదే ఏకంగా మూడుసార్లు బద్దలుకొట్టింది. హైదరా'బాదుడు'కు బెంగళూరు (287), ముంబై (277), ఢిల్లీ (266) బాధితులయ్యాయి. ఢిల్లీపై కోల్‌కతా 272 పరుగులు చేసి మూడో అత్యధిక స్కోరు చేసింది.

చల్ హట్!

పారిస్‌లో శరణార్థులపై పోలీసుల పంజా

ఒలింపిక్స్ నిర్వాహకులపై విమర్శలు

పారిస్: మరికొద్ది రోజుల్లో మొదలుకాబోయే ఒలింపిక్స్ కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న పారిస్.. నగరంలో బతుకుజీవుడా అంటూ పొట్టచేతబట్టుకుని వచ్చిన శరణార్థుల శిబిరాలను ఖాళీ చేయిస్తోంది. విశ్వక్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించే సీన్ నది ఒడ్డున టెంట్లు వేసుకుని ఉంటున్న వలసజీవులను సోమవారం అర్ధరాత్రి పోలీసులు అక్కడ్నుంచి పంపించారు. పశ్చిమ ఆఫ్రికా, ఇతర దేశాల నుంచి పారిస్‌కు వచ్చిన శరణార్థులు వేలల్లో ఉన్నారు. ఇదిలాఉండగా పోలీసుల చర్యపై మానవహక్కుల కార్యకర్తలు మండిపడుతున్నారు. దీనిని 'ప్రీ ఒలింపిక్ స్వీప్'గా వాళ్లు అభివర్ణిస్తున్నారు. ఒలింపిక్స్ చూసేందుకు వచ్చే వీక్షకులకు, పర్యాటకులకు పారిస్ నగర సౌందర్యం తప్ప శరణార్థులు కనబడొద్దన్నట్టుగా ఫ్రాన్స్ వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు.

శంషాబాద్‌కు రద్దీలో నాల్గో స్థానం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): విమాన ప్రయాణికుల రద్దీలో శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) దేశంలో నాల్గో స్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను విమాన ప్రయాణికుల సంఖ్యపరంగా దేశంలోని టాప్-10 విమానాశ్రయాల వివరాలను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించింది. నిరుడు ఏప్రిల్ మొదలు ఈ ఏడాది మార్చి ఆఖరుదాకా మొత్తం 2,50,42,482 మంది దేశ, విదేశీ ప్రయాణికులకు ఆర్‌జీఐఏ సేవలందించినట్టు తెలిపింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే గణనీయంగా 19.3 శాతం వృద్ధిని సాధించింది. నాటి ప్రయాణికులు 2,09,96,027 గానే ఉన్నారు. ఈసారి 40 లక్షలకుపైగా ప్యాసింజర్లు పెరిగారు. ఇదిలావుంటే గత ఆర్థిక సంవత్సరం ప్రయాణికుల రద్దీలో మొదటి మూడు స్థానాల్లో ఉన్న విమానాశ్రయాల్లో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (7,36,73,708 మంది), ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం (5, 28,20,754 మంది), బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం (3,75,28,533 మంది) ఉన్నాయి. ఇక బేగంపేటలోని విమానాశ్రయం నుంచి ప్రయాణించిన వీవీఐపీ ప్యాసింజర్లు 2023-24లో 8,064 మందిగా ఉన్నారు. 2022- 23లో 1,938 మంది మాత్రమే ప్రయాణించారు.

పసిడి పరుగుకు బ్రేక్

ఒకేరోజు రూ.1,450 తగ్గిన తులం • రూ.72,200కు దిగొచ్చిన ధర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: బంగారం ధరలు శాంతించాయి. రోజుకొక రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడం, ట్రేడర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గు చూడటంతో ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో మంగళవారం ఒకేరోజు తులం బంగారం ధర రూ.1,450 తగ్గింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి పుత్తడి ధర రూ.72,200కి దిగొచ్చింది. అంతకుముందు రోజు ధర రూ.73,650గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లోనూ 24 క్యారెట్ కలిగిన స్వచ్ఛమైన తులం బంగారం ధర రూ.1,530 తగ్గి రూ.72,160కి చేరుకున్నది. గతంలో ఇది రూ.73,690గా నమోదైంది. అలాగే రూ.1,400 తగ్గిన 22 క్యారెట్ ధర రూ.66,150కి చేరుకున్నది. గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ధరలు చేరుకోవడంతో సామాన్యుడు కొనుగోలు చేయడానికి వెనుకంజ వేశారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో అత్యవసరంగా ఉన్నవాళ్లు మాత్రమే గోల్డ్‌ను కొనుగోలు చేశారని, కానీ పెట్టుబడులు పెట్టాలనుకునేవారు అచితూచి వ్యవహరించారని బులియన్ వర్తకుడు తెలిపారు. చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో బంగారం అమ్మకాలు 15 శాతం నుంచి 30 శాతం వరకు పడిపోయాయని కోల్‌కతా బులియన్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పెట్టుబడిదారులు సురక్షితమైన బంగారం వైపు తమ పెట్టుబడులు మళ్లించడంతో గత పది రోజుల్లోనే ధర రూ.10 వేలకు పైగా పెరిగిన విషయం తెలిసిందే.

భారీగా తగ్గిన వెండి

బంగారంతో పాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో వెండి వెలవెలపోయింది. కిలో వెండి ఏకంగా రూ.2,300 దిగొచ్చి రూ.85,800 నుంచి రూ.83,500కి దిగొచ్చింది. ఇటు హైదరాబాద్‌లోనూ కిలో వెండి రూ.2,500 తగ్గి రూ.86,500గా నమోదైంది. అంతకుముందు ఇది రూ.89 వేలుగా ఉన్నది. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఒకేరోజు 55 డాలర్లు పడిపోయింది. కోమెక్స్‌లో స్పాట్ గోల్డ్ ధర 2,310 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. మంగళవారం కూడా ధరలు మరింత తగ్గాయి.

మధ్య తూర్పు ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, అమెరికా ఫెడరల్ రిజర్వు ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గించే అవకాశం లేకపోవడంతో మదుపరులు తమ పెట్టుబడులను బంగారం నుంచి ఈక్విటీల వైపు మళ్లించడం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే కొన్ని రోజుల్లో ఎంసీఎక్స్‌లో గోల్డ్ ధర రూ.70 వేల మార్కుకు దిగి రావచ్చునని అంచనావేస్తున్నారు.

వాణిజ్య

డాటా ట్రాఫిక్‌లో జియో ఫస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 23: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో..డాటా వినిమయంలో దూసుకుపోతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరినాటికి తన నెట్‌వర్క్‌లో డాటా ట్రాఫిక్ 40.9 ఎక్సాబైట్‌లకు చేరుకున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రపంచ టెలికం దిగ్గజం చైనా మొబైల్‌ను అధిగమించినట్లు అయింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే డాటా ట్రాఫిక్ దాదాపు 35.2 శాతం పెరిగింది. మరోవైపు, 2018లో భారత్‌లో నెలవారీ మొబైల్ డాటా ట్రాఫిక్ 4.5 ఎక్సాబైట్లు ఉండగా..కరోనా తర్వాత వార్షిక డాటా ట్రాఫిక్ 2.4 రెట్లు పెరిగింది. అలాగే తలసరి నెలవారీ డాటా వినియోగం మూడేండ్ల క్రితం కేవలం 13.3 జీబీ ఉండగా, ప్రస్తుతం ఇది రెండు రెట్లు పెరిగి 28.7 జీబీకి చేరుకున్నది.

సైయెంట్ డీఎల్ఎం ఆకర్షణీయం

హైదరాబాద్, ఏప్రిల్ 23: ప్రముఖ టెక్నాలజీ సంస్థ సైయెంట్ అనుబంధ సంస్థ సైయెంట్ డీఎల్ఎం ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1,192 కోట్ల ఆదాయంపై రూ.61.2 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే 43.2 శాతం పెరగగా, నికర లాభంలో 92.9 శాతం వృద్ధి నమోదైంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో ఆంథోనీ మోంటల్బానో మాట్లాడుతూ..ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలను మరింత బలోపేతం చేయడానికి పలు కీలక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ రెండు విభాగాల నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయని, వచ్చే రెండేండ్లలో మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు.

ఎయిర్‌టెల్ నయా గ్లోబల్ రోమింగ్ ప్యాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: భారతీ ఎయిర్‌టెల్..అంతర్జాతీయ రోమింగ్ ప్యాక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్యాక్ కింద రోజుకు రూ.133 చొప్పున చార్జీ విధిస్తున్నది. ఈ రోమింగ్ ప్యాక్ 184 దేశాలకు వర్తించనున్నదని, ముఖ్యంగా డాటా ప్రయోజనాలు, విమానాల్లో కనెక్టివిటీ కల్పించింది.

జీసీసీ హబ్‌గా హైదరాబాద్

ఆఫీస్ స్పేస్ లీజ్ వృద్ధిలో మనమే టాప్ • నిరుటితో పోలిస్తే 261 శాతం వృద్ధి

దేశ, విదేశీ కంపెనీలకు అనుకూలంగా మారిన భాగ్యనగరం: నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో హైదరాబాద్ హబ్‌గా మారుతున్నది. ముఖ్యంగా ఐటీ, ఐటీఈఎస్ కార్యకలాపాలు నిర్వహించే జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు భాగ్యనగరమే అడ్డాగా నిలుస్తున్నది. తమ కార్యకలాపాలను విస్తరించేందుకు, ప్రపంచ స్థాయిలో కొత్తగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు హైదరాబాద్‌నే ఎంపిక చేసుకుంటున్నాయి. ఇందుకోసం పెద్ద మొత్తంలో ఆఫీసు స్పేస్‌ను లీజుకు తీసుకుంటున్నాయి. దేశంలోని ఎనిమిది ప్రధాన మెట్రో నగరాల్లో కొత్త జీసీసీలు తీసుకున్న ఆఫీస్ స్పేస్‌లో సింహభాగం హైదరాబాద్‌లోనే ఉన్నాయని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా ఈ నెల మొదటి వారంలో వెల్లడించిన నివేదిక ప్రకారం దేశంలోనే హైదరాబాద్‌లో జీసీసీల కోసం ఎక్కువ ఆఫీసు స్పేస్‌ను ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు లీజుకు తీసుకున్నాయని పేర్కొన్నది. 2024 జనవరి-మార్చి త్రైమాసికంలో 2 మిలియన్లు (సుమారు 20 లక్షల చదరపు అడుగులు) హైదరాబాద్‌లో కంపెనీలు లీజుకు తీసుకున్నాయని, ఇతర నగరాలతో పోల్చితే 39 శాతం అధికమని నివేదికలో వెల్లడించింది. 2023 మొదటి త్రైమాసికం (క్యూ1-2023)లో 0.8 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన ఆఫీస్ స్పేస్ లీజుకు తీసుకోగా, తాజాగా 2024 క్యూ1లో అది 3.0 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని ఐటీ కంపెనీలు లీజుకు తీసుకున్నాయని నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదికలో వెల్లడించింది. జీసీసీలకు హబ్‌గా మారేందుకు దేశంలోనే హైదరాబాద్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని నిపుణులు తెలిపారు. ఇతర దేశాలు, నగరాలతో పోల్చితే హైదరాబాద్ కేంద్రంగా జీసీసీలను ఏర్పాటు చేస్తే ఖర్చు తగ్గడంతోపాటు నైపుణ్యం కలిగిన మానవవనరుల లభ్యత అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

జనవరి-మార్చిలో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్

	(మిలియన్ చ.అడుగుల్లో)		వృద్ధి
నగరం	2023	2024	(శాతంలో)
బెంగళూరు	3.5	3.5	0
ఢిల్లీ-ఎన్‌సీఆర్	2.6	3.1	19
హైదరాబాద్	0.8	3.0	261
ముంబై	2.2	2.8	23
పుణె	0.8	1.2	50
చెన్నై	0.8	1.2	50
అహ్మదాబాద్	0.4	0.5	25
కోల్‌కత్తా	0.2	0.2	0

భారత్‌పే వన్

అందుబాటులోకి ఆల్-ఇన్-వన్ పేమెంట్ డివైజ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: దేశీయ ఫిన్‌టెక్ దిగ్గజం భారత్‌పే 'భారత్‌పే వన్' పేరుతో ఓ ఆల్-ఇన్-వన్ పేమెంట్ ప్రొడక్ట్‌ను ప్రారంభించింది. డెబిట్, క్రెడిట్ కార్డులతో పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) వాడకం, క్యూఆర్ కోడ్ స్కానింగ్, ట్యాప్ అండ్ పే, స్పీకర్ ఇలాంటివన్నింటినీ ఒకే డివైజ్‌లో అందుబాటులోకి తెచ్చింది. తొలి దశలో దేశవ్యాప్తంగా దాదాపు 100 నగరాల్లోకి ఈ డివైజ్‌ను తీసుకెళ్లాలని చూస్తున్నామని, ఈ క్రమంలోనే వచ్చే 6 నెలల్లో సుమారు 450 నగరాల్లోకి తెస్తామని కంపెనీ ఈ సందర్భంగా ఓ ప్రకటనలో తెలియజేసింది. 'హై-డెఫినిషన్ టచ్ స్క్రీన్ డిస్‌ప్లే, 4జీ, వైఫై కనెక్టివిటీ, ఆధునిక ఆండ్రాయిడ్